సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 26 । డిసెంబర్ । 2024



లక్ష్మీనరసింహస్వామి సేవలో విప్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదర్శ యూత్ క్లబ్‌ను ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప, వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, ఆదర్శ యూత్ క్లబ్ అధ్యక్షుడు బత్తిని మల్లేశం పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించండి



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలో నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని సీపీఐ జిల్లా నేతలు కోరారు. కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. మూషం రమేశ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా నివేశన స్థలాలున్నా రిజిస్ట్రేషన్ హక్కులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

సిరిసిల్లఎడ్యుకేషన్: ఓపెన్‌స్కూల్‌లో టెన్త్, ఇంటర్ ప్రవేశాల గడువు ఈనెల 30 వరకు పొడగించినట్లు సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అభ్యర్థులు ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. పదోతరగతిలో ప్రవేశాలకు గతంలో విద్యనభ్యసించిన పాఠశాల నుంచి టీసీ, రికార్డుషీట్, కులసర్టిఫికెట్ పత్రాలు సమర్పించాలని తెలిపారు. ఇంటర్‌లో చేరే వారు పదోతరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణపత్రం సమర్పించాలని తెలిపారు. ఇప్పటి వరకు స్కూల్‌కు వెళ్లని వారు సైతం పదోతరగతిలో చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, జిల్లాలోని అధ్యయన కేంద్రాలు ఎంపిక చేసుకోవాలని సూచించారు.

చలో హైదరాబాద్‌కు మద్దతు

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది సమస్యల పరిష్కారానికి పక్షం రోజులుగా సమ్మె జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు గురువారం చేపట్టే చలో హైదరాబాద్‌కు మద్దతు ఇస్తున్నట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న దానిని పాలకులు పక్కకు పెట్టడం సరికాదన్నారు. వెట్టిచాకిరీగా విధులు చేయించుకోవడం అన్యాయమన్నారు.

భూమి కేసులో ఒకరికి లుకౌట్

- హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన దోమకొండ రాజవ్వ 2022లో తన భూమి విషయంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. మల్లారెడ్డిపేటకు చెందిన కర్రె చందు ఏ–7 ముద్దాయిగా ఉన్నాడని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కేసు పెండింగ్‌లో ఉండగా.. చందు దుబాయ్ వెళ్లాడని తెలిపారు. అతనిపై లుకౌట్ నోటీసు జారీ చేసి.. దుబాయ్ నుంచి తిరిగి వస్తుండగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేసినట్లు తెలిపారు. పాస్‌పోర్టును కోర్టుకు సమర్పించి చందును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం భాగ్యరేఖ తెలిపారు. ఖోఖోలో కె.జస్వంత్, బాలికల విభాగంలో లక్ష్మీప్రసన్న, ఫుట్‌బాల్‌లో వివేక్ ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన వారు ఈనెల 29 నుంచి జనవరి 2 వరకు వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.



రావి ఆకుపై ఏసు

వేములవాడఅర్బన్: వేములవాడలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ఆర్ట్ టీచర్, సూక్ష్మ కళాకారుడు గాలిపెల్లి చోలేశ్వర్‌చారీ క్రిస్మస్ సందర్భంగా రావి ఆకుపై ఏసు చిత్రాన్ని వేశాడు. చిత్రాన్ని చూసిన పలువురు చోలేశ్వర్‌చారీని అభినందిస్తున్నారు.

హార్ట్ అటాక్



ఈ ఫొటోలోని వ్యక్తి ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కుంబాల జలపతిరెడ్డి. 30 ఏళ్లుగా దుబాయ్‌కి వెళ్లి వస్తున్నాడు. రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఇంటి వద్ద పంటపొలాలు చూసుకోవడంతో పాటు చిన్నపాటి శుభకార్యాలకు వెళ్లి వచ్చాడు. నవంబర్ 30న ఉదయం మెలకువ రాలేదు. కుటుంబ సభ్యులు లేపగా కదలిక లేకపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇది సైలెంట్ హార్ట్‌స్ట్రోక్‌గా వైద్యులు పేర్కొన్నారు.



ఈమె పేరు అవదూత కమల. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామం. నెల రోజుల క్రితం ఉదయం వేళ ఇంటి పనులు చేస్తూ అస్వస్థతకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా, గుండెపోటుతో అప్పటికే మరణించింది. చలికాలం కావడం, ఆస్తమా ఉండడం కూడా సమస్యగా మారినట్లు వైద్యులు తెలిపారు. చలికాలంలో ఆస్తమా పేషెంట్లు ఎక్కువగా గుండెసంబంధిత వ్యాధితో మరణిస్తున్నారని పేర్కొన్నారు.



ఇతను ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌కు చెందిన రైతు కుషంగి దేవేందర్‌రెడ్డి. 20 రోజుల క్రితం పొలం పనులు చూసుకొని ఇంటికి తిరిగి వస్తూ మార్గమధ్యలోనే కుప్పకూలాడు. సమీప పొలాల్లోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, అతడి కొడుకు వచ్చి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించాడు. అయినా అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. నిత్యం పొలంలో శ్రమించే రైతు గుండెపోటుతో మరణించడం కలకలం రేపింది.



- చలికాలం సైలెంట్ మరణాలు
- నిద్రలోనే పోతున్న ప్రాణాలు
- జిల్లాలో నెలరోజుల్లో 30 మంది మృతి
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- ఆహార అలవాట్లతోనే ముప్పు అంటున్న వైద్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చలికాలం ప్రాణసంకటంగా మారుతోంది. గుండెపోటుతో ప్రాణాలు పోతున్నాయి. షుగర్, బీపీ పేషెంట్లకు ఈ శీతాకాలం మరింత ముప్పుగా మారుతోంది. సైలెంట్ హార్ట్ స్ట్రోక్స్ నిద్రలోనే ప్రాణాలు తీస్తున్నాయి. రెండు నెలల్లో జిల్లాలో సైలెంట్ హార్ట్‌స్ట్రోక్స్‌తో 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో సగానికి పైగా యువకులే ఉండడంతో వారి కుటుంబాలు రోడ్డునపడ్డాయి.

ప్రాణసంకటంగా ఆహారపు అలవాట్లు

ఇటీవల ప్రజల్లో వచ్చిన ఆహారపు అలవాట్లే ప్రాణసంకటంగా మారుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. జంకుఫుడ్, అధిక నూనె ఉన్న ఆహారపదార్థాలు తినడంతోనే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరుగుతోంది. అంతేకాకుండా ఆహారంలో మాంసం, చికెన్ ఎక్కువగా తీసుకోవడం ఊబకాయానికి దారితీస్తోంది. ఊబకాయం అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. ప్రధానంగా కాలేజీ విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఇంటి నుంచి తెచ్చుకోకుండా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో ఫ్రైడ్‌రైస్, నూడుల్స్, పిజ్జాలు, బర్గర్‌లు వంటి జంకుఫుడ్ తింటూ చిన్నప్రాయంలోనే గుండెపోటుకు గురవుతున్నారని వైద్యనిపుణులు విశ్లేషిస్తున్నారు. షుగర్, బీపీ ఉన్నవారు ఆరు నెలలకోసారి ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

తగ్గుతున్న శారీరక శ్రమ

ఇటీవల వస్తున్న మార్పులతో ప్రజల్లో శారీరక శ్రమ తగ్గిపోతుంది. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోవడం, ఇంట్లో చిన్నచిన్న పనులకు సైతం మెషినరీలు రావడంతో శ్రమ ఏమాత్రం లేకుండా పోయింది. ఉదాహరణకు బట్టలు ఉతికేందుకు వాషింగ్‌మెషిన్లు, ఇల్లు ఊడ్చేందుకు వాక్యూమ్ క్లీనర్లు రావడంతో మహిళల్లో, ప్రతీ పనికి బైక్ వినియోగంతో పురుషుల్లో శారీరక శ్రమ లేకుండా పోతుంది.

అలవాట్లు మార్చుకోవాలి



ప్రజలు తమ ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. ఇప్పుడు అందరూ రెడీమేడ్ ఫుడ్ అయినా హోటళ్ల, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లలో తింటున్నారు. అక్కడ వాడుతున్న నూనె కల్తీ కావడంతోపాటు నాణ్యత లేకపోవడంతో బ్యాడ్ కొలెస్ట్రాల్ పెరిగిపోతుంది. రోజూ కనీసం 45 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయడం ఆరోగ్యకరం. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారైనా ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

– వంశీకృష్ణ, జనరల్ ఫిజీషియన్

హ్యాపీ క్రిస్‌మస్



బీవైనగర్‌లోని బేతెస్థ బాప్టిస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మహేందర్‌రెడ్డి, శ్యామ్ కల్వల

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని ప్రార్థనమందిరాల్లో బుధవారం క్రిస్‌మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని విశ్వాసులు ఉదయమే ప్రార్థన మందిరాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లోని రిజరక్షన్ లైఫ్ మినస్ట్రీస్, బేతెస్థ బాప్టిస్ట్ చర్చిలో భారీ సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బీవైనగర్‌లోని బేతెస్థ బాప్టిస్ట్ చర్చిలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పాల్గొని క్రిస్‌మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, రెవరెండ్ శ్యామ్ కల్వల ప్రభువు లోక రక్షణ కోసం చేసిన సందేశాన్ని అందించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సంగీతం శ్రీనివాస్, వెల్ముల తిరుపతిరెడ్డి, టీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. సుభాష్‌నగర్‌లోని సీఎస్ఐ సెయింట్ మార్క్‌చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకున్నారు. పాస్టర్లు డీకే వెల్లెస్లీ, నాలుక సత్యం, గుండం నర్సయ్య, కోట్లారి సుశీల, గుడిసె కనకమ్మ, దుప్పటి రవికుమార్, బాబూరావు, రాగుల జగన్, దొమ్మాటి సంజీవ్, రాయిండ్ల ప్రేమానందం పాల్గొన్నారు.



సుభాష్‌నగర్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు



సుభాష్‌నగర్ చర్చిలో హాజరైన భక్తులు

సింగసముద్రం నీటి విడుదల

- 1600 ఎకరాలకు అందనున్న సాగునీరు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ శివారులోని రైతుల వరప్రదాయని సింగసముద్రం ఆయకట్టుకు బుధవారం నీటిని విడుదల చేశారు. మండలంలోని నారాయణపూర్, సర్వాయిపల్లి, రాచర్లబొప్పాపూర్, కోరుట్లపేట, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లోని 1600 ఎకరాలకు సాగునీరు అందించేందుకు నీటిని విడుదల చేశారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో మాజీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కాల్వల పూడిక తీత పనులు చేపట్టారు. సింగసముద్రంలో 24 ఫీట్ల వరకు నీరు నిల్వ ఉందని, ఆయకట్టుకు నీరు అందుతుందని తెలిపారు. కనెక్టింగ్ కాలువల చైర్మన్ ఒగ్గు బాల్‌రాజ్, మాజీ సర్పంచులు కొండాపురం బాల్‌రెడ్డి, నేవూరి వెంకట్‌రెడ్డి, మేడిపల్లి దేవానందం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, రాంరెడ్డి, మెండే శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్, రవీందర్‌రెడ్డి, చల్ల మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సింగసముద్రం నీటిని విడుదల చేస్తున్న నాయకులు

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

సింగసముద్రం నీటిని విడుదల చేయడానికి వెళ్లిన బాద రాములు అనే వీఆర్వో సముద్రం తూం వద్ద కొబ్బరికాయ కొట్టడానికి వెళ్లి కాలుజారీ పడిపోతుండగా, పక్కనే ఉన్న కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్ పట్టుకొని ఒడ్డుకు చేర్చాడు. రాములు సముద్రంలో పడిపోకుండా కాపాడిన గౌస్‌ను పలువురు అభినందించారు.

వాజ్‌పేయ్‌కి నివాళి



మాజీ ప్రధాని వాజ్‌పేయ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ విలువలతో కూడిన రాజకీయవేత్త అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కొనియాడారు. వాజ్‌పేయ్ శతజయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని బీజేపీ ఆఫీస్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, నాయకులు బండ మల్లేశం, పిన్నింటి హన్మండ్లు, అక్కపెల్లి వివేక్‌రెడ్డి, గుడిసె మనోజ్, రేగుల రాజకుమార్, నామాల శేఖర్, బిల్ల కృష్ణ, నేరెళ్ల సాయికుమార్, మామిండ్ల లక్ష్మీరాజం, రేగుల శ్రీకాంత్, రాజశేఖర్, సగ్గు రాహుల్, నగేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేగండం దాటేనా?!

- ఈసారైనా రోడ్డు విస్తరణ జరిగేనా?
- ఇప్పటికే నాలుగుసార్ల సర్వేలు
- తాజాగా నాలుగు బృందాలతో వివరాల సేకరణ

వేములవాడ: ఆధ్యాత్మిక కేంద్రం.. దక్షిణకాశీగా పేరొందిన వేములవాడలో రోడ్డు విస్తరణ అంశం ఏళ్లుగా నానుతూనే ఉంది. ప్రతీసారి సర్వే చేస్తున్న అధికారులు నివేదికతోనే సరిపెడుతున్నారు. ఇప్పటికే నాలుగుసార్లు సర్వే చేయగా.. తాజాగా మరోసారి నాలుగుశాఖల అధికారులు రోడ్డు విస్తరణ కోసం సర్వే చేస్తున్నారు. మూలవాగు వంతెన నుంచి రాజన్న గుడి వరకు 80 ఫీట్లతో విస్తరణ చేపట్టేందుకు సర్వే చేస్తున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ రోడ్డు విస్తరణపై ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. రోడ్డు విస్తరణకు ప్రభుత్వం రూ.47కోట్లు ప్రకటించడంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

నాలుగుసార్లు సర్వేలు

వేములవాడ ప్రధాన రహదారి విస్తరణకు అధికారులు నాలుగుసార్లు సర్వే చేశారు. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రభుత్వ విప్ పదవి దక్కడంతో రోడ్డు విస్తరణ ప్రక్రియ ముందుకు సాగుతోందని పట్టణ ప్రజలు భావిస్తున్నారు. ఐదోసారి జరిగే సర్వేతోనైనా రోడ్డు విస్తరణ పనులు మొదలవుతాయా.. లేదా.. అనే చర్చ సాగుతోంది.

నాలుగు బృందాలతో తనిఖీలు



వేములవాడ మెయిన్‌రోడ్డులో సర్వేచేస్తున్న అధికారులు (ఫైల్)

పట్టణంలో రోడ్ల విస్తరణలో ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న దుకాణాలు, నివాసాలు ఎన్ని పోతున్నాయని అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. తాజాగా ఆర్డీవో నేతృత్వంలో నాలుగు బృందాలను నియమించారు. ఈ బృందాలు సర్వే జరిగిన ప్రాంతాలను తిరిగి తనిఖీ చేయనున్నారు.

నాలుగుశాఖల ఆధ్వర్యంలో సర్వే



రోడ్ల విస్తరణపై ఇటీవల నోటిఫికేషన్ వచ్చింది. ఇప్పటికే పలుమార్లు సర్వేలు చేసి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. ప్రస్తుతం ఆర్డీవో నేతృత్వంలో రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సర్వే చేస్తున్నారు. సర్వే పూర్తిచేసిన తర్వాత మున్సిపల్‌కు అప్పగిస్తే పనులు చేపట్టే అవకాశాలు ఉంటాయి.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

ఇందిరమ్మతో హౌసింగ్

- పదేళ్లు కనుమరుగైన గృహ నిర్మాణశాఖ పునరుద్ధరణ
- జిల్లా హౌసింగ్‌కు ప్రాజెక్టు డైరెక్టర్
- ఇద్దరు డీఈలు, మండలానికో ఏఈ
- జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు 1,07,398 దరఖాస్తులు

ముస్తాబాద్(సిరిసిల్ల): పేదలకు ఇళ్లు కట్టించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కాంగ్రెస్ సర్కార్ కనుమరుగైన గృహనిర్మాణ శాఖను పునరుద్ధరిస్తోంది. తెలంగాణ ఏర్పాటుకు ముందు సమైక్యాంధ్రలో ఉన్న గృహనిర్మాణశాఖను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తివేసిన సంగతి విదితమే. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో భారీగా అవినీతి జరిగిందంటూ హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌ను రద్దు చేసింది. ఆ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని ఇతర శాఖలకు కేటాయించింది. డబుల్‌బెడ్రూం ఇళ్లను ప్రజల ముందుకు తీసుకువచ్చింది. అయితే ఈ పథకం అంతగా విజయవంతం కాకపోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడం జరిగిపోయింది. కొత్త ప్రభుత్వం ఏడాదిలో గృహనిర్మాణ శాఖకు ఊపిరి పోసి, ఆ మేరకు అధికారులు, సిబ్బందిని మాతృశాఖకు పంపే ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి.



ఇందిరమ్మ ఇంటి నమూనా

మాతృశాఖకు ఇంజినీర్లు, సిబ్బంది

బీఆర్ఎస్ హయాంలో చాలా మంది పేదల సొంతింటి కల నెరవేరలేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఇందిరమ్మ పథకాన్ని 2004లో తీసుకువచ్చారు. ఆ పథకం ఊరూరా విజయవంతమై, ప్రతీ గ్రామంలో ఇందిరమ్మకాలనీ కనిపిస్తుంది. అదే స్ఫూర్తితో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రద్దయిన గృహనిర్మాణ శాఖను తీసుకువచ్చి, ఇతర శాఖల్లో ఉన్న ఇంజినీర్లు, సిబ్బందిని మాతృశాఖకు తీసుకువస్తోంది. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడకు ఇద్దరు డీఈలను నియమించింది. ప్రస్తుతం ముగ్గురు ఏఈఈలను కేటాయించింది. అలాగే హౌసింగ్‌కు పీడీని నియమించే పనిలో అధికారులు ఉన్నారు. వారం రోజుల్లో ఏఈలు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు తమ మాతృశాఖలో చేరే అవకాశం ఉంది. ఒకవేళ ఎవరైనా ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో మిషన్ భగీరథ నుంచి ఇంజినీర్లను తీసుకునే ఏర్పాట్లు చేస్తోంది.

సర్వేలో హౌసింగ్ అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కొత్తగా వచ్చిన హౌసింగ్ అధికారులు సర్వేలో చురుకుగా పాల్గొంటున్నారు. సిరిసిల్ల డీఈ భాస్కర్, ఏఈలు హమీద్, రాజ్‌మోహన్ ఆయా మండలాల్లో సర్వేను పరిశీలిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 7వేల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందే. అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలన్న లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. కాగా, జిల్లాలో 1,07,398 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు హౌసింగ్ డిపార్ట్‌మెంట్, పంచాయతీ రాజ్ అధికారులు 59,822 దరఖాస్తులపై సర్వే పూర్తి చేశారు. స్థలం ఉన్న లబ్ధిదారులకు రూ.5లక్షలు మంజూరు చేయనున్నారు.

మండలాల వారీగా దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు
బోయినపల్లి	6,976
చందుర్తి	6,420
ఇల్లంతకుంట	10,216
గంభీరావుపేట	8,761
కోనరావుపేట	8,299
ముస్తాబాద్	9,460
రుద్రంగి	3,780
సిరిసిల్ల	12,454
తంగళ్లపల్లి	9,528
వీర్నపల్లి	3,668
వేములవాడ	4,960
వేములవాడ అర్బన్	8,591
వేములవాడరూరల్	4,759
ఎల్లారెడ్డిపేట	9,526
మొత్తం	1,07,398

పేదలకు మేలు



గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌ను రద్దు చేసి పేదలకు అన్యాయం చేసింది. హౌసింగ్ శాఖ ఉంటే అర్హులు ఇళ్లు కట్టుకునేలా చూస్తుంది. అర్హులందరికీ ఇళ్లు కట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం హౌసింగ్ శాఖను తీసుకు వచ్చింది.

– కనమేని చక్రధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ కో–కన్వీనర్

మాతృశాఖకు వస్తున్నారు

పదేళ్ల క్రితం హౌసింగ్‌శాఖ నుంచి ఇతర శాఖలకు వెళ్లిన అధికారులకు మాతృశాఖలో చేరేందుకు ప్రభుత్వం ఆప్షన్లు ఇచ్చింది. ఇప్పటికే జిల్లాలో డీఈఈలు, ఏఈఈలు చేరారు. మరింత మంది త్వరలో చేరుతారనే సమాచారం ఉంది.

– భాస్కర్, డీఈఈ, హౌసింగ్

క్లుప్తంగా

వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని చింతకుంట చెరువులో దూకి షేక్ ఇక్బాల్ (58) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. కామారెడ్డిలోని హనుమాన్‌వాడకు చెందిన షేక్ ఇక్బాల్, సబేర దంపతులకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. చిన్న కుమారుడు జాకీర్ జగిత్యాలలో నివాసం ఉంటాడు. కొద్దిరోజుల క్రితం చిన్న కొడుకు వద్దకు వచ్చి బీట్‌బజార్లో ఉంటున్నాడు. ఈనెల 22న మద్యం తాగేందుకు భార్యను డబ్బులు అడిగాడు. ఆమె తన వద్ద లేవనడంతో కూరగాయలు కోసే కత్తితో సబేర గొంతుకోసి పరారయ్యాడు. సబేరను కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆ భయంతో షేక్ ఇక్బాల్ చింతకుంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సబేర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మన్మథరావు తెలిపారు.

బావిలో పడి రైతు మృతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కండ్లపల్లిలో ఓ రైతు వరినారుకు నీరు పెట్టడానికి వెళ్లి కాలుజారి బావిలో పడి చనిపోయిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్సై గజేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిర్రి రాజన్న (65) నారుకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. మోటార్ ఆన్‌చేసే క్రమంలో కాలుజారి బావిలో పడిపోయాడు. రాజన్న ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు కలిసి పొలం వద్దకు వెళ్లి వెదుకుతుండగా.. బావిలో శవమై కనిపించాడు. రాజన్నకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజన్న భార్య దేవక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెల్ల డించారు.

వృద్ధురాలి బలవన్మరణం

గన్నేరువరం(మానకొండూర్): హన్మజిపల్లె గ్రామానికి చెందిన కాంతాల లక్ష్మీకాంతమ్మ (80) అనే వృద్ధురాలు మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు. మూడు సంవత్సరాలుగా మతిస్థిమితం లేక ఇబ్బందులు పడుతోందని, ఈ క్రమంలో జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు రెండో కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వృద్ధుడు..

శంకరపట్నం(మానకొండూర్): కన్నాపూర్‌లో నూనె భూమయ్య(80) మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు కేశవపట్నం ఎస్సై రవి తెలిపారు. కడుపు నొప్పి, నడుము నొప్పితో కొన్ని రోజులుగా బాధపడుతున్న భూమయ్య బాత్‌రూంలో ఉరేసుసుకున్నాడని మృతుడి భార్య కనకమ్మ బుధవారం ఫిర్యాదు చేసిందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

చొప్పదండి: కాట్నపల్లి గ్రామంలో బుధవారం తొమ్మిదిన్నర తులాల బంగారు ఆభరణాల చోరీ జరిగిందని ఎస్‌ఐ గొల్లపల్లి అనూష తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. గ్రామంలో రైస్ మిల్లు నడుపుతూ జీవనం సాగించే గన్ను వెంకట్‌రెడ్డి-రాణి దంపతులు బుధవారం బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. రాణి తన బీరువా నుంచి తొమ్మిదిన్నర తులాల బంగారు ఆభరణాలను ఇంట్లోని ముందు గది హాల్‌లో పెట్టి రైస్ మిల్లు దగ్గర భర్తకు టిఫిన్ ఇచ్చి వచ్చింది. ఇంటికి వచ్చి చూసేసరికి నాలుగు బంగారు గాజులు, ఒక చంద్రహారం మొత్తం బంగారు ఆభరణాలు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూడోలో సత్తా చాటుతాం

- విజయమే లక్ష్యంగా సాధన చేశామంటున్న క్రీడాకారులు
- రేపటి నుంచి పోటీలు



జూడోలో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్రంలో జూడో క్రీడకు కేరాఫ్ అడ్రస్‌గా కరీంనగర్ జిల్లా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం జిల్లాలో రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరగడం ఆనావయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్-2024 క్రీడాపోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయి జూడో పోటీలను ప్రభుత్వం కరీంనగర్ జిల్లాకే కేటయించడం విశేషం. దీంతో జిల్లాకు చెందిన క్రీడాకారులు విజయమే లక్ష్యంగా సాధన చేయడం ఆరంభించారు. రేపటి నుంచి మూడు రోజులపాటు కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రాష్ట్రస్థాయి సీఎం కప్ జూడో పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన పలువురు క్రీడాకారుల అభిప్రాయాలు వారి మాటల్లోనే.

చాంపియన్‌గా నిలుస్తా



సీఎం కప్ జూడో పోటీల్లో చాంపియన్‌గా నిలుస్తా. విజయం సాధించాలనే లక్ష్యంతో రోజు హార్డ్ వర్క్ చేశా. 30 కిలోల లోపు విభాగంలో పోటీ పడుతున్నా. చాలా సంతోషంగా ఉంది. గతంలో చాలాసార్లు రాష్ట్ర పోటీల్లో పాల్గొన్నా. రాజస్తాన్‌లో జరిగిన ఎస్జీఎఫ్‌ఐ జూడో పోటీల్లో పాల్గొన్నా. నాలుగో స్థానం సాధించా.

– ఆర్.కార్తీక్, కరీంనగర్

సంతోషంగా ఉంది



రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కరీంనగర్ జిల్లా ఆతిథ్యమివ్వడం సంతోషంగా ఉంది. గతంలో చాలాసార్లు రాష్ట్రస్థాయిలో రజత, కాంస్య పతకాలు సాధించా. స్వర్ణ పతకం సాధించాలనేది లక్ష్యం. 63 కిలోల్లోపు విభాగంలో పాల్గొంటున్నా. తప్పకుండా గెలుస్తానన్న నమ్మకముంది.

– బి.మన్విత, పెద్దపల్లి

బాగా సాధన చేశా



సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పతకం సాధించాలనే లక్ష్యంతో రోజు బాగా సాధన చేశా. జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించా. రాష్ట్రస్థాయిలో కూడా సాధిస్తా. రాజస్తాన్‌లో జరిగిన ఎస్జీఎఫ్‌ఐ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ప్రస్తుతం 44 కిలోల్లోపు విభాగంలో పాల్గొంటున్నా.

– డి.వర్షిత, కరీంనగర్

ఓపెన్ కేటగిరీలో..



జూడోలో జాతీయస్థాయిలో చాంపియన్‌గా నిలవాలనేది నా ఆశయం. గతంలో ఎస్జీఎఫ్, జూడో అసోసియేషన్ల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రజత, కాంస్య పతకాలు సాధించా. ప్రస్తుతం ఓపెన్ వెయిట్ కేటగిరిలో పాల్గొంటున్నా.

– ఎస్.రోహన్‌నాయక్, సిరిసిల్ల

సాధిస్తారన్న నమ్మకం ఉంది

కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాల వేదికగా సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొంటున్నారు. క్రీడా పాఠశాలకు చెందిన క్రీడాకారులు పెద్ద మొత్తంలో పతకాలు సాధిస్తారనే నమ్మకముంది. చాంపియన్‌షిప్‌ను కూడా కైవసం చేసుకుంటాం.

– కె.శ్యామ్, ఖేలో ఇండియా జూడో సెంటర్ కోచ్, కరీంనగర్

ఆస్తులు కాజేశారు.. అంత్యక్రియలు మరిచారు



వృద్ధురాలి ఇంటి తాళాలు పగులగొడుతున్న స్థానికులు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్థానికులు

- అంతిమసంస్కారాలు చేసిన స్థానికులు

జగిత్యాలక్రైం: ఆమెకు కన్నబిడ్డలు లేరు. బంధువులు అన్నీ చూసుకుంటారని భావించిన ఆమె ఆస్తులు పంచింది. కానీ.. ఆమె ఆస్తులు తీసుకుని.. తీరా ఆమె చనిపోతే కనీసం అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా నిరాకరించారు. ఈ అమానవీయ ఘటన జిల్లాకేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఆమె మృతదేహాన్ని సుమారు ఆరు గంటల పాటు అంబులెన్స్‌లోనే ఉంచారు. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని తీన్‌ఖని చౌరస్తా ప్రాంతానికి చెందిన సాదుల సత్తమ్మ భర్త 20 ఏళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి పిల్లలు లేకపోవడంతో తమ ఆస్తిని బంధువులకు అప్పగించింది సత్తమ్మ. వృద్ధాప్యంతో మంగళవారం ఆమె ఆస్పత్రిలో చనిపోయింది. దీంతో బంధువులు అంబులెన్స్‌లో శవాన్ని ఇంటికి తీసుకొచ్చారు. ఆస్తి తీసుకున్న వారు శవాన్ని ఇంట్లోకి నిరాకరించడంతో రాత్రి 11 గంటల వరకు మృతదేహం అంబులెన్స్‌లో రహదారిపైనే ఉంది. పట్టణ ఎస్సై గీత జోక్యం చేసుకుని వృద్ధురాలి ఇంటి తాళాలు పగులగొట్టి మృతదేహాన్ని అందులో ఉంచారు. అయితే బుధవారం కూడా ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులెవరూ రాకపోవడంతో స్థానికులే అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

ఇద్దరు అదృశ్యం



లక్ష్మి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు అదృశ్యమయ్యారని పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌కు చెందిన అంబటి రాజయ్య-లక్ష్మి దంపతులకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రాజయ్య కూలీ పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. లక్ష్మి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లతోపాటు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం ఆమె భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గోపాల్‌పూర్‌లో యువకుడు..



గణేశ్

కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్‌కు చెందిన బెజ్జంకి గణేశ్ అనే యువకుడు మంగళవారం రాత్రి ఇప్పుడే వస్తానంటూ ఇంట్లోవాళ్లకు చెప్పి, బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండటంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. బుధవారం బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని తల్లి కనకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మ్యాన్‌హోల్‌లో దిగబడ్డ కారు



మ్యాన్‌హోల్‌లో దిగబడ్డ కారును పైకి లేపుతున్న స్థానికులు

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట బస్టాండు ఆవరణలో మ్యాన్‌హోల్ తెరిచి ఉండడంతో బుధవారం కారు ముందు చక్రం అందులో దిగబడింది. బస్టాండ్‌లోని మ్యాన్‌హోల్ తెరిచి ఉందని వారం క్రితం సాక్షిలో కథనం ప్రచురితమైనా అధికారులు స్పందించలేదు. అధికారులు స్పందించి, ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని స్థానికులు చర్చించుకుంటున్నారు. కారు చక్రాన్ని స్థానికులు పైకి లాగారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు మ్యాన్‌హోల్‌ను మూసివేయాలని కోరారు.

హరిహరపుత్రనే శరణమయ్యప్ప



ముస్తాబైన అయ్యప్ప ఆలయం



జాతర కరపత్రం ఆవిష్కరణ

- రేపు కోరుట్లలో అయ్యప్ప జాతర
- లక్ష మంది వస్తారని అంచనా
- సౌకర్యాల కల్పనకు సన్నాహాలు
- అన్నదానం కోసం ఏర్పాట్లు



ప్రత్యేకాలంకరణలో అయ్యప్ప స్వామి

కోరుట్ల: 'స్వామియే శరణమయ్యప్ప.. హరిహరపుత్రనే శరణమయ్యప్ప'..అనే శరణుఘోషతో నెల రోజులుగా కోరుట్ల అయ్యప్ప ఆలయ పరిసరాలు మార్మోగిపోతున్నాయి. అయ్యప్ప జాతరకు ఆలయం ముస్తాబైంది. ఈ జాతరకు దాదాపు లక్ష మంది వరకు భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈమేరకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

ఉదయం నుంచి సాయంత్రం దాకా

శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి అయ్యప్పస్వామికి సుప్రభాతసేవ, మూల విరాట్టుకు అభిషేకాలు, గణపతిహోమం, దివ్యపదునెట్టాంబడి పడిపూజ, రథోత్సవం కనులపండువగా నిర్వహించనున్నారు. అయ్యప్ప ఆలయ పరిసరాల్లోని అన్నదానం కోసం ఇప్పటికే సుమారు 5 ఎకరాల స్థలంలో పరిసరాలు పరిశుభ్రం చేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వేయి మంది వలంటీర్ల సహకారం తీసుకోనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు. అయ్యప్ప మాలధారులకు, ఇతర భక్తులకు వేర్వేరుగా బిక్ష(అన్నదానం) నిర్వహిస్తున్నట్లు వివరించారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

లక్ష మంది వస్తారని అంచనా

ఏటా డిసెంబర్ 27న జరిగే అయ్యప్ప జాతరకు కోరుట్ల, మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్ మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ఈ జాతరలో సుమారు 50వేల మందికి అన్నదానం చేయనున్నారు. ఈ అన్నదానానికి పెద్ద సంఖ్యలో భక్తులు విరాళాలు అందజేస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణ, అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు. సుమారు రూ.60లక్షలతో నిర్మించతలపెట్టిన ఆలయ కాంపౌండ్‌కు మాలధారులు సహకరించారని తెలిపారు. ఈనెల 27న జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అయ్యప్ప స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

జిల్లాస్థాయి జూడో పోటీలకు స్పందన



తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో బుధవారం కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి జూడో సబ్ జూనియర్స్, కెడెట్స్ బాలబాలికల ఎంపిక పోటీలకు విశేష స్పందన వచ్చింది. జిల్లా నలుమూలల నుంచి సుమారు 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అంతకుముందు ఈ పోటీలను మానేరు విద్యాసంస్థల అధినేత, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణలో జూడో పోటీలకు మానేరు విద్యాసంస్థలు నిలయంగా మారాయన్నారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను ఈనెల 29, 30ల్లో కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జరిగే 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూడో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు జిల్లా ఆతిథ్యమివ్వడం గర్వకారణమన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, జిల్లా యోగా సంఘం ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి సిలివేరి మహేందర్, యోగా సంఘం బాధ్యులు ఎల్వీ రమణ, గోలి సుధాకర్, శ్రీధర్, ప్రాంతీయ క్రీడా పాఠశాల కోచ్ బి.సాయిరాంయాదవ్, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత



బ్యాగు అప్పగిస్తున్న సీఐ కోటేశ్వర్

కరీంనగర్‌క్రైం: ఓ మహిళ పోగొట్టుకున్న బ్యాగును కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు వెతికి, ఆమెకు అప్పగించారు. సీఐ కోటేశ్వర్ వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన కలికోట మౌనిక బుధవారం తన కుటుంబసభ్యులతో కలిసి బస్సులోకేశవపట్నం వెళ్తోంది. కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకున్నాక.. బ్యాగులు ఒకే రకంగా ఉండటంతో మరో ప్రయాణికురాలు మౌనిక బ్యాగును తీసుకెళ్లింది. బాధితురాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఫిర్యాదు చేసింది. బ్యాగు తీసుకెళ్లిన మహిళ ఓ ఆటో ఎక్కినట్లు పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో గుర్తించారు. ఆటోడ్రైవర్ అహ్మద్‌ఖాన్‌కు ఈ విషయం తెలుపగా అతను సదరు మహిళ ఇంటిని చూపించడంతో బ్యాగు దొరికింది. అందులోని బంగారు, వెండి వస్తువులను పోలీసులు బాధితురాలికి అప్పగించారు. బ్యాగును గుర్తించిన క్రైం పార్టీ పోలీస్ కుమార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది అశోక్, ఆటోడ్రైవర్ అహ్మద్ ఖాన్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ వాజిజ్ ఖాన్‌లను సీఐ కోటేశ్వర్ అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో మంకమ్మతోటలోని సిద్ధార్థ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా.. 15 మంది బంగారు, 12 మంది రజత పతకాలు సాధించారు. విద్యాసంస్థల అధినేత దాసరి శ్రీపాల్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కబడ్డీలో జిల్లా జట్టుకు తృతీయ స్థానం



బాలికల జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: మేడ్చల్ జిల్లాలోని హకీంపేటలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. బాలికలు అద్వితీయ పోరాట పటిమను కనబరిచి తృతీయ స్థానం సాధించారు. జిల్లా బాలికల జట్టు నారాయణపేట జిల్లా జట్టుపై 36-22 స్కోర్ తేడాతో విజయం సాధించి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అమిత్‌కుమార్, మల్లేశ్‌గౌడ్, వర్కింగ్ అధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు, చైర్మన్ ప్రసాద్‌రావు, వైస్ చైర్మన్ అనూకర్‌రావు, కోచ్ పద్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.




హరహర మహాదేవ



వేములవాడ: వరుసగా సెలవులు రావడంతో రాజన్నను బుధవారం 50వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలాచరించిన భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణవ్రతాలు, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. లడ్డూ ప్రసాదాలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. భక్తుల ద్వారా రూ.45లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కాలువ నీటితో విద్యుత్ ఉత్పత్తి

- ఎస్సారెస్పీ డీ-83 కాలువపై 10 మినీ హైడల్ ప్రాజెక్టులు
- జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహణ : 56 మందికి ఉపాధి
- గ్రిడ్‌కు అనుసంధానంతో లో వోల్టేజీ సమస్యకు చెక్
- ఉత్పత్తి వ్యయం తక్కువ.. నాణ్యత ఎక్కువ



కుమ్మరికుంట వద్ద డీ-83 కాకతీయ కాలువపై నిర్మించిన మినీ జల విద్యుత్ కేంద్రం



విద్యుత్‌ను ఉత్పత్తి చేసే టర్బైన్లు, జనరేటర్లు

జూలపల్లి(పెద్దపల్లి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆయకట్టుకు సాగునీరు అందించే ఎస్సారెస్పీ డీ-83 కాకతీయ కాలువపై వివిధ చోట్ల ఏర్పాటు చేసిన మినీ హైడల్ ప్రాజెక్టుల ద్వారా రోజూ 9.16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అంతేకాదు.. వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ఇలా తయారైన కరెంట్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడం ద్వారా లో వోల్టేజ్ సమస్య కూడా పరిష్కారమవుతోంది.

జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహణ..

శ్రీరాంసాగర్(ఎస్సారెస్పీ) ప్రాజెక్టు డీ - 83 ప్రధాన కాలువ, డీ - 86 కాలువల ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు విడుదల చేస్తున్నారు. ఇందులోని డీ-83పై మినీ హైడల్ ప్రాజెక్టులు నిర్మించగా.. జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహణ చేపట్టారు. ఇది జిల్లాలోని ధర్మారం మండలం నుంచి జూలపల్లి, పెద్దపల్లి వరకు, ఆ తర్వాత సుల్తానాబాద్ తదితర మండలాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది. అయితే, ఎస్సారెస్పీ ద్వారా సాగునీరు విడుదల చేసిన ప్రతీసారి డీ -83 మెయిన్ కెనాల్‌పై నిర్మించిన మినీ హైడల్ ప్రాజెక్టుల్లో రోజూ 9.16 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

పది జలవిద్యుత్ కేంద్రాలు..

శ్రీరాంసాగర్ డీ-83 మెయిన్ కెనాల్‌పై వివిధ చోట్ల పది మినీ హైడల్ కేంద్రాలు నిర్మించారు. వీటికి టర్బైన్లు బిగించారు. జనరేటర్లు ఏర్పాటు చేశారు. నీటి ఉధృతితో టర్బైన్లు తిరుగుతూ జనరేటర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీనిని ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా 33కేవీ లైన్‌కు అనుసంధాంచి తుర్కలమద్దికుంటలోని సబ్‌స్టేషన్‌కు సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి డిస్కంలకు పంపిణీ చేస్తున్నారు.

చొప్పదండిలో ప్రారంభం..

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రెవెల్లె గ్రామం వద్ద ప్రారంభమయ్యే డి- 83 కాలువపై పలు చోట్ల 10 మినీ హైడల్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేట 6వ మైలురాయి వద్ద 500 కిలోవాట్ల సామర్థ్యం గలవి, ఏడో మైలురాయి అబ్బాపూర్ వద్ద 500 కిలోవాట్లవి, తొమ్మిదో మైలురాయి కుమ్మరికుంట వద్ద 500 కిలోవాట్లవి, పదో మైలురాయి కుమ్మరికుంట వద్ద 220 కిలోవాట్లవి, పన్నెండో మైలురాయి కాచాపూర్ వద్ద 325 కిలోవాట్లవి, 14వ మైలురాయి పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట వద్ద 500 కిలోవాట్లవి, 16వ మైలురాయి చందపల్లి వద్ద 500 కిలోవాట్ల జల విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి.

56 మందికి ఉపాధి..

పది జల విద్యుత్ కేంద్రాల్లో 56 మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోంది. ఐటీఐ పూర్తిచేసి అప్రెంటీస్‌లో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులను జెన్‌కో అధికారులు ఇక్కడ ఆపరేటర్లుగా నియమించారు.

మినీ జలవిద్యుత్ కేంద్రాలు

మండలం	ప్రాంతం	ప్రాజెక్టులు
పెద్దపల్లి	చందపల్లి	2
పెద్దపల్లి	బొంపల్లి	1
పెద్దపల్లి	తుర్కలమద్దికుంట	2
జూలపల్లి	కాచాపూర్	1
జూలపల్లి	కుమ్మరికుంట	2
జూలపల్లి	అబ్బాపూర్	1
ధర్మారం	కమ్మర్‌ఖాన్‌పేట	1

కాలువలో సామర్థ్యం మేరకు నీటి పారకం ఉన్నసమయంలో ఆపరేటర్లు టర్బైన్లు ఆన్ చేస్తారు. జనరేటర్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి సాఫీగా సాగేలా నిత్యం పర్యవేక్షిస్తుంటారు. అంతేకాదు.. ప్రతీ వేసవిలో టర్బైన్లు, జనరేటర్లను ఓవర్‌హాలింగ్ చేసి.. విద్యుత్ ఉత్పత్తికి సన్నద్ధం చేయడంలో జెన్‌కో అధికారులు వీరికి సాయం చేస్తూ ఉంటారు.

నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి

ఎస్సారెస్పీ డీ- 83 మెయిన్ కాలువలో పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసినప్పుడు టర్బైన్లను ఆన్‌చేసి జనరేటర్ల ద్వారా నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం. అక్కడి నుంచి సబ్‌స్టేషన్‌కు తరలించి డిస్కంకు సరఫరా చేస్తున్నాం. ఇక్కడ తక్కువ ఖర్చుతో జల విద్యుత్ ఉత్పత్తి చేయడమే మినీ హైడల్ ప్రాజెక్టుల లక్ష్యం.

– నరేశ్, డీఈ, జెన్‌కో